క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



మంగపేట: ఎంపీడీ ఓగా బానోత్ బద్రు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ కృష్ణప్రసాద్ జులై 23న కరీంనగర్ జిల్లా శంకరపట్నంకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆయన స్థానంలో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించాడు. కాగా, హనుమకొండ జిల్లా డీఆర్‌ఆర్‌డీఏ(మెప్మా) పీడీగా పనిచేస్తున్న బద్రు ఎంపీడీఓగా బదిలీపై వచ్చి పూర్తి బాధ్యతలను స్వీకరించారు. నూతన వచ్చిన ఆయనకు ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు, కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ నాగేందర్, టైపిస్ట్ భిక్షపతి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు వేదికలో చోరీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం రైతు వేదికలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఏఈఓ శ్యామ్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదిక గ్రీల్స్‌ను తొలగించి రైతు వేదికలో ఉన్న బ్యాటరీ, ఇన్వర్టర్‌ను చోరీ చేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


టమనమ్మ(ఫైల్)

ములుగు: ములుగు మండలం కొడిషాలకుంట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు భూక్యా టమనమ్మ(105) సోమవారం మృతి చెందారు. టమనమ్మ కొంత కాలంగా గోవిందరావుపేట మండలం పాపయ్యపల్లిలో ఆమె పెద్ద కుమారుడు శంకర్ వద్దనే ఉంటుంది. కాగా అనారోగ్యంతో మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. టమనమ్మకు కుమారులు శంకర్, బాలు, లాలు, మనవలు లచ్చిరామ్‌నాయక్, సీతరామ్ నాయక్ సునీల్, చిరు, మునిమనవలు ఉన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాలడుగుల వెంకటకృష్ణ, చింత క్రాంతి కుటుంబ సభ్యులను పరామర్శించి మృత దేహానికి నివాళులర్పించారు.

వాగులో కొట్టుకుపోయిన మేకలు మృతి




ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని బంధాల గ్రామంలో వాగు దాటే క్రమంలో వరదలో కొట్టుకపోయిన 17 మేకలు మృతి చెందినట్లు బాధిత యజమానులు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మేత కోసం మేకలను ఆదివారం బంధాల గ్రామ సమీప అడవిలోకి తీసుకెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలోని వాగు వరదలో నుంచి మేకలను దాటిస్తుండగా ఒకసారిగా పెరగడంతో వాగులో మేకలు కొట్టుకపోయి మృతి చెందినట్లు తెలిపారు. నాలి నర్సయ్యకు చెందిన 6 మేకలు, నాలి నడిపి నర్సయ్యకు చెందిన 8, చేరుకుల ఎర్రయ్య 3 మేకలు మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత పశువుల యజమానులు కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కాటారం(మహాముత్తారం): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, తరగతి గదుల నిర్వహణ, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు గణిత సబ్జెక్ట్ బోధించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి మండలంలోని వాగుల పరిస్థితిని పరిశీలించారు. వాగులు ఉప్పొంగితే తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకాధికారి అధికారులకు సూచనలు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మల్హర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని అధిక స్థానాల్లో గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్క రూ కృషి చేయాలని ఆ పార్టీ మంథని అసెంబ్లీ కన్వీ నర్, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ మల్కా మోహన్‌రావు అన్నారు. సోమవారం తాడిచర్లలో పార్టీ మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్ ఆధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. ఫోన్ నంబర్ 88000 02024కు మిస్డ్ కాల్ పద్ధతి ద్వారా సభ్యత్వ నమోదు గురించి వివరించారు.

మరిచిపోలేని మహానేత వైఎస్సార్

వెంకటాపురం(ఎం): మరిచిపోలేని మహానేత వైఎస్సార్ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తాళ్లపాడు వద్ద గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు మామిడిశెట్టి కోటి, కాంగ్రెస్ నాయకులు జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, భూస సాంబయ్య, చీకుర్తి రమేష్, అల్లాడి రాజేశ్వర్‌రావు, ఎస్‌కె.జాకీర్, తోట రాజు, వెంకటేష్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచి వైఎస్ రాజశేఖరరెడ్డి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు మాట్లాడుతూ.. అభివృద్ధికి దిక్సూచి వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన రైతు బాంధవుడని అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం శివ, తోట శ్రీను, ధనపనేని నాగరాజు, చిట్టెం సాయి, రమేశ్, ఐలయ్య, మాజీ ఎంపీటీసీ కొండపర్తి సీతదేవి తదితరులు ఉన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పీహెచ్‌సీలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి దేశంలో ఎక్కడ లేనటువంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత మహానేత వైఎస్సార్‌ది అన్నారు. 108, 104 వంటి పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు ఉచిత వైద్యం అందించి ఎందరికో పునర్జన్మనిచ్చి నేటికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉన్నారని కొనియాడారు. దేశానికి అన్నంపెట్టే రైతన్న సంక్షేమమే ధ్యేయంగా రుణమాఫీ పథకం ద్వారా ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన మహానేత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


మంగపేట: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


వెంకటాపురం(ఎం): వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


వెంకటాపురం(కె): వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన పెల్లి యమున అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. నలుగురు గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రతలపై పలు సూచనలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టి 10 మంది జ్వర పీడుతులకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. వారికి నెగిటీవ్ రిపోర్టు రావడంతో మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం సారమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'పాలకుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం


రాళ్లవాగును పరిశీలిస్తున్న గోవింద్ నాయక్

ములుగు: పాలకుల నిర్లక్ష్యం వల్లనే రాళ్లవాగు పనుల్లో జాప్యం జరుగుతుందని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం రాళ్లవాగును ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న బండారుపల్లి శివారులో జూన్ నెలలో రోడ్డు కొట్టుకపోయి రాకపోకలకు ఇబ్బందులు కలిగి అన్ని వైపులా ఉన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించిందని అన్నారు. ఈ విషయంపై గ్రామాల ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ల వాగుపై శాశ్వత బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని 163వ జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పునరావాస కేంద్రంలో బూటారం గ్రామస్తులు


గిరిజన భవనంలో బూటారం గ్రామస్తులు

ఏటూరునాగారం: మండలంలోని బూటారం గ్రామం చుట్టూ జంపన్నవాగు వరద ఉధృతి ఉండడంతో గ్రామస్తులను మండల కేంద్రంలోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే ఆదివారం, సోమవారం నుంచి ఈ కేంద్రంలోనే శరణార్థులు సేద తిరుతున్నారు. వారికి గ్రామ పంచాయతీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. తాగునీరు, కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. వరద ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో ఇక్కడే వారు తలదాచుకున్నారు. ఇంటిల్లిపాది సైతం గొడ్డు గోదా, సామగ్రిని వదిలేసి తరలివచ్చినట్లు బాధితులు తెలిపారు. వాగు ఉధృతి మరింత ఎక్కువైతే ప్రాణ, ఆస్తినష్టం జరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు 232 మందిని తరలించినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. వర్షాలు, వరదలు తగ్గే వరకు ఇక్కడే ఉంటారని వెల్లడించారు.


భోజనం చేస్తున్న ముంపు బాధితులు

శాశ్వత మరమ్మతులు చేపట్టాలి


ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న నరేశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: పస్రా–తాడ్వాయి మధ్యలోని జలగలంచ, మొండ్యాలతోగు వద్ద హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన వర్షాల వరదకు పస్రా–తాడ్వాయి మధ్యలో ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షాలకు ఈ మార్గంలో బ్రిడ్జిలు ధ్వంసమవుతున్నా అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వదిలేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ల మేలు కోసమే తూతుమంత్రంగా మరమ్మతు పనులు చేస్తున్నారు తప్ప హైలెవల్ బ్రిడ్జిలు నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. శాశ్వత మరమ్మతు పనులు చేయకుండా మట్టి పోసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారిన బ్రిడ్జిల నిర్మాణాలపై దృష్టిసారించడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు శాశ్వత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సిద్ధబోయిన సురేందర్, డ్యాగల సలేందర్ ఉన్నారు.

లారీ, బస్సు ఢీ


ఢీ కొట్టిన లారీ

ములుగు: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు బస్టాండ్ నుంచి ఏటూరునాగారం బయలుదేరిన బస్సు రోడ్డు క్రాస్ చేస్తుండగా హనుమకొండ నుంచి ములుగు వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును డివైడర్ వైపు తిప్పాడు. లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పుట్ట మహేష్ ఇటీవలన పిడుగు పడి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆ గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని డిగ్రీకళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 4లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు రెండు జతలు కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. అదనపు అర్హతలు నెట్, సెట్ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

తేలికపాటి వర్షం

కాటారం: మండలంలో సోమవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. రెండో రోజుల పాటు భారీగా కురిసిన వర్షం కొంత పాటి విరామం ఇచ్చింది. దీంతో పలు గ్రామాలకు మధ్యలో ఉన్న వాగుల్లో వరద నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు సజావుగా సాగాయి. పత్తి చేలలో వరద నీటి నిల్వలు కొంత మేర తగ్గినప్పటికీ రైతులకు మాత్రం తీవ్ర నష్టం చోటుచేసుకుంది. వర్షానికి ఇబ్రహీంపల్లికి చెందిన దబ్బెట మొండయ్య ఇంటి గోడ కూలిపోయింది.

జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎల్బాక జంపన్నవాగుపై లోలేవల్ కాజ్‌పై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఎల్బాక, పడిగాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాజ్‌వే వద్ద గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం వర్షకాలంలో ఎల్బాక కాజ్‌పై నుంచి వరద ప్రవహించడంతోపాటు, మేడారం నుంచి వచ్చే దారిలో కొంగల మడుగు వరద రోడ్డును కమ్మేయడంతో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయన్నారు. మూడు రోజులు క్రితం కురిసిన వర్షాలకు వరదలతో రాకపోలు నిలిచిపోవడంతో నిత్యావసర సరుకులను, వైద్య సేవలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రెండు గ్రామాలకు ఉన్న దారులపై వరద ప్రవహించడంతో అత్యవసర సమయంలో కూడా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే లోలేవల్ కాజ్‌పై హైలేవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

రైతులకు పరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

ములుగు రూరల్: వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని సర్వాపూర్–జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గులవాగు వరద ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదలతో జిల్లాలో వందలాది ఎకరాలు నీట మునిగాయని అధికారులు పంటల నష్టం అంచనా వేయాలని అన్నారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు మూడు నెలల రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలని అన్నారు. ఇటీవల వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. బొగ్గుల వాగు వరద కారణంగా జగ్గన్నగూడెం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. సర్వాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ జనతాపార్టీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట సతీష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంగళరావు పేట గ్రామంలో మోర్చా మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, బట్ట రవికుమార్ , రాము తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

పలిమెల: నేరాలు తగ్గించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం పంకెన గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలు జరగకుండా నిరోధించడానికి సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ప్రజల సహకారంతో త్వరలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత


బియ్యం అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లికి చెందిన అట్టం కృష్ణమూర్తి ఇల్లు ఇటీవల కూలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి స్వచ్ఛంద సేవా సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 25 కేజీల బియ్యం, వంట పాత్రలను అందజేశారు. బర్లగూడెం మాజీ సర్పంచ్ నర్సింహామూర్తి, చిడెం సాయి ప్రకాశ్, బట్టి విజయ్, రాధకృష్ణ, వినోద్ తదితరులు ఉన్నారు.

ఏడాది నుంచి ఎదురుచూపు

- లభించని శ్రీమాన్ ఆచూకీ
- కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిసిన తల్లిదండ్రులు


కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసిన శ్రీమాన్ తండ్రి సమ్మిరెడ్డి, తదితరులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన గుర్రం శ్రీమాన్ నేవీలో పనిచేస్తూ షిప్‌లో గల్లంతై ఏడాది గడిచినా ఆయన ఆచూకీ మాత్రం లభించలేదు. ఏడాది నుంచి శ్రీమాన్ తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నారు. గుర్రం సమ్మిరెడ్డి, రమ దంపతుల కుమారుడు శ్రీమాన్ 2023లో ఇరాన్ దేశంలో ప్రైవేట్ నేవీ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. గతేడాది డిసెంబర్ 23న నదిలో షిప్ మునిగిపోవడంతో షిప్‌లో ఉన్న శ్రీమాన్ గల్లంతయ్యాడు. ఏడాది నుంచి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం నిద్రహారాలు లేకుండా ఎదురుచూస్తున్నారు. కంపెనీ ప్రతినిధులను తల్లిదండ్రులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరిన ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చివరికి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఫోన్ ద్వారా తెలిపారని తల్లిండ్రులు చెబుతున్నారు. జిల్లా అధికారులను, మంత్రి సీతక్కను కలిశారు. ఇటీవల తల్లిదండ్రులు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి శ్రీమాన్ ఘటన వివరాలను వివరించారు. ప్రైవేట్ నేవీ కంపెనీ ప్రతినిధులతో గానీ భారతీయ రాయబారులతో సంప్రదించి వీలైనంత త్వరగా గల్లంతైన శ్రీమాన్ ఆచూకీ కోసం కృషి చేస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శ్రీమాన్ ఆచూకీ తెలుసుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు


విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్: భారీ వర్షాల కారణంగా జిల్లాలో విద్యుత్ సమస్యలు లేకుండా సత్వర చర్యలు చేపడుతున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్హార్ నాయక్ తెలిపారు. సోమవారం జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులతో కలిసి మల్హార్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు విరిగి స్తంభాలపై పడటంతో 223 స్తంభాలు, 9 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయన్నారు. వరదల వల్ల నీట మునిగిన సబ్ స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ విద్యుత్‌ను సరఫరా అందిస్తున్నామన్నారు. విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉందని, సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే తమ సిబ్బంది మరమ్మతులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌పై జాగ్రత్త వహించాలని, విద్యుత్ స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ సమస్యల కోసం 79016 28364 నంబర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.